కోదండంది చిన్న పల్లెటూరు. ఉద్యోగంలేదు. కొద్దిపాటి భూస్థితిమాత్రం వుంది. పల్లెలో బ్రతుకంటే అతడి భార్యకు రోత. పల్లెటూరి మగడన్నా ఏవగింపే. కానీ కోదండం పట్నవాసపు మగడుగా వుండడానికైనా తన కేమీ అభ్యంతరం లేదన్నాడు. ఇద్దరూ కలిసి కట్టుగా మాట్లాడుకుని బావమరిది కాపురం చక్కదిద్దడంకోసం పిల్లలతో సహా పట్నవాసం వచ్చేశారు. రావడమే రావడం! తిరిగి వెళ్లలేదు. ఎప్పుడైనా వెళ్లవలసివస్తే కోదండం ఒక్కడు మాత్రమే వెళ్తాడు. కౌలు కిచ్చిన భూములపైన కోరుగింజలు వసూలుచేసి అక్కడి కొట్టువాడికే కొలిచి డబ్బు జేబులోవేసుకుని చక్కా బస్సెక్కేస్తాడు!

ఒకానొక వస్తువును మన యిష్టం వచ్చినట్టు మనం ఉపయోగించుకోవచ్చు. కానీ మనిషి విషయంలో చాలా ప్రతిబంధకాలున్నాయి. మనిషికి కోరిక లుంటాయి. అభిరుచులుంటాయి. వాటికి తగ్గట్టు యిష్టాయిష్టా లుంటాయి. తన పెళ్లికి సంబంధించి శారద ఆశలు, ఆశయాలు ఎలాంటివో తెలుసుకోడాని కెవరూ ప్రయత్నించలేదు. ఎలాగైనా ఆమెను వదిలించుకోడ మొక్కటే తమ ధ్యేయమైనట్టుగా ప్రవర్తించారు. పెళ్లయిపోయింది. శారద రూపవతి, గుణవతి, విద్యావతి. కానీ పెళ్లిళ్ల సంతలో ఆమె వెలపోవడానికి ఈ క్వాలిఫికేషన్లే కారణమని తోచదు. తనకులేనిదానిపైన తన ఆధిక్యతను ప్రకటించడంకోసమే ఆ మొగుడు ఈ పెళ్లి చేసుకున్నట్టున్నాడు. ఈ అధిక్యతా ప్రకటనం పెళ్లయిన మరుక్షణంనుంచే ప్రారంభమైపోయింది. నరహరికి సెలవులైపోవస్తున్నాయి. అతడు భార్యను పుట్టింట మరికొంతకాలం వుండనివ్వగలడన్న ఆశకు తావులేదు. అంచెలవారీ పద్ధతిలోగాకుండా ఒక్కవూపులో అతడు భార్యను లోగొనే ప్రయత్నంలో వున్నాడు. కానీ క్రొత్తజీవితంలోకి నిర్భయంగా చొచ్చుకపోయే చొరవ శారదలో లీలగానైనా కానరావడంలేదు. ఏమౌతుంది? ఏమౌతుంది? అన్న సందేహం గొంతుకోసి క్రిందపడవేసిన కోడిపెట్టలా వా మనసులో కొట్టుమిట్టాడిపోతోంది.

శారద తన ఆవేదనను ఎవరితో చెప్పుకుంటుంధి? తల్లిదండ్రులు ఎలాగో ఆమెకు పెళ్లి చేసేశాముగదా అన్న సంతృప్తితో వున్నారు. చెల్లెళ్లు క్రొత్త పెళ్లికూతుళ్ల వాలకమింతే కాబోలు ననుకుంటున్నారు.

ప్రయాణానికిక ఒకటి రెండురోజుల గడువుందనగా శారద ఒక చిన్నకోరికను వ్యక్తం చేసింది. పోస్టాఫీసుకు వెళ్లి ఓడజను కవర్లు తెచ్చిపెట్టమంది.

'అలాగేనమ్మా !' అన్నాను.

'నాకేమో సందేహంగానే వుందన్నయ్యా ' వీళ్లు జాబులు వ్రాయడానికైనా అనుమతిస్తారనిపించదు' అంది

'పరవాలేదమ్మా ! వీళ్ళూ మనుషులేగదా !' అన్నాను.

'అవునో, కాదో తేల్చుకోడానికేగదా వెళ్తున్నది'.

నవ్వలేక నవ్వింది శారద.

కంటిలో నలుసుపడి కలుక్కుమన్నట్టుగా మనసు చివుక్కుమంది.

శారద సంసారానికి వెళ్లిపోయిన నాలుగో నాటినుంచీ బాబాయి గారింట్లో అందరికీ పోస్టుమేన్ కోసం ఎదురుచూడడం ఒక నిత్యకృత్యమైపోయింది. కానీ మొదటి ఉత్తరం వాళ్ల తీర్పును పూర్తిగా పరీక్షించిన తర్వాతగానీ అందలేదు.

'ప్రియమైన నాన్నగారికి నమస్కారాలు. జాబు వ్రాయడం ఆలస్యమైనందుకు మన్నించండి. మీ ఉత్తరాలు నా కందకపోయినా, వ్రాస్తుంటారని తెలుసు. కానీ నేను వ్రాయనందుకు ఒక కారణం వుంది. మీకు, అమ్మకు, యింకా అక్కడున్న మనవాళ్ల కందరికీ కాస్తంత సంతోషం కలిగించే వార్త ఏదైనా యిక్కడ కనిపిస్తుందేమోనని యిన్నినాళ్లు వేచివున్నాను....

'పోగా యింకొక కారణం లేకపోలేదు. జాబులు వ్రాయడానికి కావలసిన ఏకాంతం యిక్కడ దొరకదు. అనుక్షణం నేనేం చేస్తున్నానో గమనించడానికి

యింట్లో గూఢవారులున్నారు. వాళ్ల దృష్టిలో జాబులు వ్రాయడంకన్నా తప్పిదం లేదు. చదువుకున్నవాళ్లు చేసే తప్పుడు పనుల్లో జాబులు వ్రాయడ మొకటని వీళ్ల అభిప్రాయం.

'పెళ్లి కావడంవల్ల నా బ్రతుకులో వచ్చిన పెద్దమార్పు, మీకందరికీ దూరం కావడం. మధ్య దూరం రెండువందల మైళ్లు. కానీ నేను మిమ్మల్ని మరచిపోయేటట్టుగా చేయగల ఆప్తులుగానీ, ఆత్మీయులుగానీ నాకిక్కడెవరూ కనిపించడం లేదు. వీళ్లు నాపైన ఏదో ఎక్స్‌పెరిమెంటు చేయడాని కన్నట్టుగా యిక్కడికి నన్ను తెచ్చేసుకున్నారు. ఆ ఎక్స్‌పెరిమెంటు నిరాఘాటంగా సాగిపోతోంది. ఎంతసేపు చేసినా తెమలని చాకిరీలో నా ఒళ్లు యంత్రంలా మసలుకోడానికి అలవాటు పడిపోతోంది. ఎక్కడ తీరిక దొరకి పోతుందోనని పనులు పురమాయించడమే పనిగా ఆడపడుచుగారు అత్తగారులేనికొరతను తీర్చేస్తున్నారు. పనిచేయకుండా చెడదింటే ఒళ్లు బలిసి కొవ్వెక్కుతుందట! పిల్లినో, కుక్కనో చాటుగా పెట్టుకుని అన్నమాటేననుకోండి! కానీ నేనిక్కడ పిల్లి కన్నా, కుక్కకన్నా ఉత్తమప్రాణిగామాత్రం లెక్కింపబడడం లేదు.

'రాత్రుల్లో పడుకుంటాను. ఎప్పుడునిద్రపడుతుందో తెలియదు. తెల్లవారుజామున మెలకువ వస్తుంది. నేనిప్పుడుండడం మన యింట్లో కాదని జ్ఞప్తికివస్తుంది. ఈ దిగులింక మళ్లీ నిద్రలో ఒళ్లుమరిచేదాకా నన్ను వదిలిపెట్టదు. ఓ పత్రిక చదువుకోగలనన్న ఆశలేదు. ఒక మంచిమాట వినగలనన్న ఆశలేదు. చుట్టూరావున్న పెద్దప్రపంచం నా బ్రతుక్కొక చిన్న చెరసాలను ఏర్పాటుచేసింది. ఈ చెరసాలలో నేనొక్కదాన్నే ఖైదీని! మిగిలిన వాళ్లందరూ నాపైన జైలువార్డెన్లు!

నాకు తెలియక అడుగుతున్నానండీ నాన్నగారూ! ఏంచేశానని నాకీ శిక్ష?'

కూతురు తండ్రిని నిలదీసి అడగవలసిన ప్రశ్నే! బాబాయికి మతిపోయినట్టయింది. ఆయన వెంటనే ప్రయాణం తలపెట్టేశాడు. వెళ్లిననాడు రావడానికైతే నాలుగురోజుల్లోనే తిరిగి వచ్చేశాడు. కానీ ఎలా వచ్చాడు? పాలిపోయివచ్చాడు. ముఖం వ్రేలాడవేసుకునివచ్చాడు. మనిషి ఎదురైతేచాలు, ఆయన కళ్లల్లో కన్నీరు. పలకరిస్తేచాలు కంఠంలో గాద్గద్యం.

అనుభవించేకాలంలో బాధలు హృదయాన్ని తొలిచివేస్తాయి. అప్పట్లో వాటినిగురించి మాట్లాడుకోడమంటే ఉన్న బాధను ద్విగుణీకృతం చేసుకోడమే! పెద్దసినిమాలోనుంచీ కొన్నిబొమ్మలు మాత్రం కత్తిరించి, ఒకటిగా అతికించి చూసినట్టుగా బాబాయి కొన్ని వర్తమానాలు మాత్రమే చెప్పగలిగాడు.

అక్కడున్న నాలుగు రోజుల్లోనూ నరహరి ఒకసారి మాత్రమే మామగారిని పలకరించాడట! అదిగూడా 'ఉన్నట్టుండి వచ్చేసినట్టున్నారే' అంటూ వెకిలిగా ఆశ్చర్యం ప్రకటించడం మాత్రమేనట! శారద కెన్నోవిషయాలు చెప్పాలనేవుంది. కానీ అవకాశం దొరకలేదు. నరహరి ఉదయం తొమ్మిదింటికి గానీ నిద్రలేవడు. పదికొట్టేసరికి డ్యూటీకి వెళ్లిపోతాడు. రాత్రి ఏ ఏడింటికో ఎనిమిదింటికో యిల్లు చేరుకుంటాడు. అప్పు డతనివెంట విధిగా కొందరు స్నేహితులుంటారు. ఒకనవ్వులా, ఒకమాటలా, ఒకపాటలా, ఆయింటిని వాళ్లొక లాడ్జికన్నా భిన్నమైనదిగా భావించరు. అక్కడే పేకాటగూడా కొనసాగుతుంది. ఏవైనా పానీయాలు కావలసివస్తే కోదండం సరఫరా చేస్తారు. ప్రొద్దస్తమానం శారదకు యింటిచాకిరీతోనే సరిపోతుంది. రాత్రివేళ భార్యాభర్త లొకరిముఖం ఒకరు చూచుకునే టప్పటికి లోకం మొద్దునిద్రలో మునిగివుంటుంది. ఈ ఏర్పాట్లనుబట్టి చూస్తే, శారదలోనుంచీ మానవాంశను లుప్తంచేసి, కేవలం ఒకయంత్రంగా మార్చి, ఆ యంత్రాన్ని తన యిచ్చ వచ్చిన రీతిలో వాడుకోజూస్తున్నట్టున్నారు.

